# మహిమ

తిరిగి వెళ్ళిపోతూ మెటాడర్ రేపిన ధూళి పొగల్లోంచీ 'మృత్యుంజయాశ్రమం' అన్న పేరున్న అర్ధవృత్తాకారపుబోర్డు, ఆశ్రమం ప్రహరీగోడల మధ్యలో వున్న ముఖద్వారం పైన స్పష్టాస్పష్టంగా కనబడుతోంది. ధూళి మేఘం మరి కాస్త పలచబారిన తర్వాత ద్వారానికున్న పెద్ద యినుప కమ్ముల తలుపులు కనిపించాయి. ఆ తరువాత ఆశ్రమం లోపల, పెద్ద తామర పువ్వు ఆకారంలో కట్టిన కొలను మధ్యలో, సజీవమూర్తి వొకడు కూర్చున్నాడేమోనని భ్రమ కలిగించేలా, వృద్ధసన్యాసి ప్రతిమ వొకటి గోచరమైంది. ముఖద్వారం దగ్గరున్న కొబ్బరిమట్టల పందిరి పచ్చి వాసనల్ని విరజిమ్ముతోంది. లోపల కట్టిన రంగు కాగితాల తోరణాల మధ్యలోంచీ, నల్లటి కాకొకటి యెగురుతూ వెళ్ళి ప్రతిమ తల పైన కూర్చుంది. తాపీగా రెక్కలల్లార్చబోయి, చుట్టూ జనం కలయతిరుగుతున్న పొలకువను పసిగట్టగానే అలాగే శిల్పంలో వో భాగంలా కదలకుండా నిలిచిపోయింది.

మెటాడర్ లోంచీ దిగిన పట్టు చీరల, భారీ కాయాల ముత్తయిదువలు కొందరు రకరకాల సంచుల్ని భారంగా చేతబట్టుకుని ఆశ్రమంలోకెళ్ళిపోయారు. అదే వాహనం లోంచీ దిగిన ముసలి మగవాళ్లు కొందరు ఆశ్రమం ముంగిటిలోంచే దండప్రణామాలు మొదలెడుతూ ముందుకురుకుతున్నారు. ముఖద్వారానికి కుడివైపున వున్న జోబిడీలో ఖరీదైన టేబులు ముందు రివాల్వింగ్ ఛైర్‌లో కూర్చున్న కాషాయ వస్త్రధారి, తన కౌంటరు ముందున్న వ్యక్తులతో తన్మయంగా అష్టావధానం చేస్తున్నాడు. అతడి కుర్చీ వెనకున్న

బంగారుఫ్రేము ఫోటో ముందు అగరొత్తులధూపాలు గింగిరాలు తిరుగుతున్నాయి. ఆ నిలువెత్తు చిత్రంలో ధ్యానముద్రలో కూర్చున్న సన్యాసి యెవరో స్పష్టంగా కనిపించడం లేదు.

మెటాడర్‌లోంచీ దిగిన పాతికేళ్ల యువతి ముఖంపైని కళ్ళజోడును కుడిచేత్తో సవరించుకున్నాక, యెడమ చేత్తో బరువైన జిప్ బ్యాగ్‌ను భుజానికి తగిలించుకుంటూ వెనుదిరిగి, ముఖద్వారంలోంచీ ఆశ్రమం లోపలికి నడిచింది.

"కెమెరాలూ, చెప్పులూ ఆశ్రమంలో నిషిద్ధం" అన్న హెచ్చరిక జోబిడీలోంచీ ప్రసారమైంది.

చీకాకుతో నుదుటి పైన ముడతలు చెలరేగుతుండగా అటువైపు కేసి రెండడుగులు సారించి, "నాకు స్పెషల్ పర్మిషనుంది" అంది ఆమె.

"యేదీ, వోసారి నన్ను చూడనివ్వండి" అన్నాడా సన్యాసి. . కొంతరు ముందున్న వ్యక్తులందరూ పక్కకు తప్పుకున్నారు. జిప్ బ్యాగు సొరుగులోంచీ చిన్న కాగితం ముక్కను వెదికిపట్టి అతడి టేబుల్ పైన వుంచిందావిడ. కాగితాన్ని పరిశీలించాక, "యీ పర్మిషను స్వామీజీ ప్రధానాశ్రమం లోపల చెల్లదు. అక్కడికెళ్ళేటప్పుడు దీన్ని బయటే విడిచిపెట్టాలి. యిక చెప్పుల్ని అక్కడ విడిచిపెట్టొచ్చు" అన్నాడతను చేయి చాపి వెనకున్న మండపాన్నీ చూపిస్తూ.

"యిలాంటి చోటుకొచ్చేటప్పుడైనా చక్కగా చీర కట్టుకొస్తే బావుండేది గదమ్మా! నీ అంత అందమైన ఆడపిల్లకు ఆ షాల్వార్ కమీజులు యేమీ నప్పడం లేదు. గూడానూ!..." మండపంలో ఆ యువతి తన హైహీలు జోళ్లను విడిచి పెడుతూ వుండగా, అటొచ్చిన నడి వయసు స్త్రీ వుచిత సలహాను సరఫరా చేసింది.

"యీ అందమూ చందమూ పైనుండే పనికిరాని శరీరానిదే పిన్నిగారూ! ఆత్మ సౌందర్యం కంటే మించిందేముంది చెప్పండి?" అన్న సమాధానాన్ని కోపంతో మిళాయించి ఆమె వొళ్ళోకి విసురుతూ ముందుకు కదిలిందా యువతి.

సిమెంటు రోడ్డుకిరువైపులా వున్న వృక్షాలు సృష్ట్యాది నుంచీ వున్నట్టుగా కనబడుతున్నాయి. రోడ్ల పైన జన సంరంభం యెక్కువగా వుంది. అక్కడక్కడా చెట్ల కింద కొలువుదీరిన దేవుళ్ళ ప్రతిమలు పూజ ముగించుకుని నగరయానానికి బయల్దేరిన వుత్సవమూర్తుల్లా దర్శనమిస్తున్నాయి. కొండ కిందివరకూ వ్యాపించిన ఆశ్రమ ప్రాంగణంలో, దూరదూరంగా కట్టిన భవనసముదాయాల చుట్టూ భక్తులు గుమిగూడిపోయి వున్నారు. యెదురుపడిన

యువకుడినొకణ్ణి "హలో" అంటూ పకరించబోయిందా ఆగంతకురాలు.

"సర్వం స్వామీజీ మయం" అంటూ అతను నమస్కారం చేస్తూ ముందుకు కదలిపోయాడు.

"సార్! యిక్కడ ప్రధానాశ్రమం యెక్కడ?" అంటూ మరో వ్యక్తిని అడిగిందామె.

"ఆశ్రమంలో అలా బిగ్గరగా మాట్లాడకూడదు. సర్వం స్వామిమయం..." అని సమాధానం చెబుతూ అతనూ వెళ్ళిపోయాడు. రోడ్డు పక్కనున్న బెంచీపైన కూలబడిపోయిందామె. విసుగ్గా జిప్ బ్యాగ్‌లోంచీ నీళ్ళ సీసా పైకి తీసి రెండు గుక్కలు తాగింది.

"ఆశ్రమంలో మినరల్ వాటర్ నిషిద్ధం. యిక్కడి నీళ్ళు తీర్థం. సర్వ వ్యాధి నివారణం" అంటూ వో యువకుడు బెంచీపైకొచ్చి కూర్చున్నాడు.

"యీ ఆశ్రమం లోపలికి బయటి గాలి గూడా ప్రవేశించగూడదా?" అందామె విసుగ్గా.

సన్నగా, పొడుగ్గా వున్న ఆ వ్యక్తి వొంటెలా మెడను చిత్రంగా వంచుతూ, "ముందా బ్యాడ్జీ తీసి లోపల దాచేయండి. చెప్పకుండానే మీరు జర్నలిస్టని తెలిసిపోతోంది. జర్నలిస్టులంటే యిక్కడి భక్తులకు మంచి వొపీనియన్ లేదు. నిఖిత... అదేగదూ మీ బ్యాడ్జీలో రాసిన పేరు... యిలా మనం చాలాసేపు యిక్కడ కూర్చోవడం గూడా ఫాల్టే! ఆ క్యాంటీన్‌లో కూర్చుందాం పదండి. చాలా దూరం నుంచి జర్నీ చేసి వచ్చినట్టున్నారు. బాడీకి ఫ్యూయల్ చాలా అవసరం" అన్నాడతను.

రకరకాల వయసులున్న మగవాళ్ళు, తెలుపు రంగు యూనిఫారాల్లాంటి దుస్తుల్లో నడచిపోతున్నారు. వాళ్ళ చొక్కాలకు స్వామీజీ చిత్రమున్న బ్యాడ్జీలు వేలాడుతున్నాయి.

అలాంటి బ్యాడ్జీలే ధరించిన సన్యాసినులు మరి కొందరు ఆ వెనకే సాగిపోయారు.

వాళ్ళెవరూ మాట్లాడుకోవడం లేదు. యెవరి లోకంలో వాళ్ళున్నట్టుగా, మర బొమ్మల్లా అటూ యిటూ చకచకా నడుస్తున్నారు. అందరి ముఖాల్లోనూ వింత జిలుగులు... తన్మయం.

రాజప్రాసాదంలా వెలుగుతున్న క్యాంటీనులో ఖరీదైన తివాచీలు పరిచారు. అందమైన కుర్చీలలో కూర్చున్న వ్యక్తులు కొందరు తళతళలాడుతున్న పళ్ళాల్లోంచీ ఫలహారాల్ని ఆరగిస్తున్నారు.

కౌంటరు దగ్గరి నుంచీ రెండు పళ్ళాల ఫలహారాల్ని పట్టుకొస్తూ "యిక్కడ కూర్చుందాం రండి . సర్వం స్వామీజీమయం" అన్నాడా యువకుడు.

"మీరు కూడా భక్తులేనా?" అని ప్రశ్నించింది నిఖిత.

"జర్నలిస్టుల్లో డివోటీలుండగూడదా?" అంటూ నవ్వాడతను.

"మీరు జర్నలిస్టు గూడానా?" అంటూ మరోసారి విస్మయపడిందామె.

"మరెందుకు మిమ్మల్ని రిసీవ్ చేసుకున్నాననుకున్నారు?" అన్నాడతను నెమ్మదిగా.

"నా పేరు సంతోష్. యిదిగో నా ఐడెంటిటీ కార్డు. యీ ఆపర్చ్యూనిటీ కోసం మా కొలీగ్స్ చాలా మంది ట్రై చేశారు. యెప్పుడో యుగానికొకసారి జరిగే అద్భుతం. మిస్ అయితే లైఫే వేస్టు. స్వామి అనుగ్రహం వల్ల బాస్ నన్ను వెళ్ళమన్నాడు. మీ జర్నల్‌కున్న సర్క్యులేషనూ, పాపులారిటీ తెలియని దెవరికి? యిలా రాగలిగారంటే మీరెంతో లక్కీ!"

పళ్ళాన్ని తన ముందుకు లాక్కుంటూ, "ఆశ్రమమంటే గుడిసెలూ, మండపాలూ వుంటాయనుకున్నాను. యిదేమో హాలిడే రిసార్ట్‌లా అల్ట్రా మాడ్రన్‌గా వుంది. క్యాంటీను ఫైవ్‌స్టార్ హోటలులాగుంది. యింత మంది జనం గుమిగూడినా యింత శుభ్రంగా యెలాగుంచగలుగుతున్నారు?" అని అడిగింది నిఖిత.

"యిప్పుడు యీ చోట్లో మినిమమంటే టెన్ థౌజండ్స్ జనం వుంటారు. యెక్కడైనా సౌండ్ వినబడుతుందేమో చూడండి! యెప్పుడూ ఆశ్రమంలో పక్షుల కిలకిలరావాలు వినబడాలని స్వామీజీ ఆర్డరు. యీ క్యాంటీనులో డే అండ్ నైట్ సప్లయ్ జరుగుతోంది. యిలాంటి క్యాంటీన్లు చాలా వున్నాయి. వొకసారి కిచెన్‌లోకెళ్ళి అబ్జర్వ్ చెయ్యండి. యిక్కడి పాన్‌లో బజ్జీలు కూడా సౌండు చెయ్యవు. అంట్లు కడగేదెక్కడో కనిపించదు. యీ రోడ్ల పైన పాలు పోసి పాలెత్తుకోవచ్చు. అంతా స్వామీజీ మహత్యం. అంతకంటే ఆన్సరు యింకేమీ దొరకదు..." ఫలహారం తింటూనే చెప్పుకుపోసాగాడు సంతోష్.

"ముహూర్తం యెప్పుడు?" అడిగింది ఆమె.

"కార్తీక పంచమి. ముహూర్త గడియలు యీ రోజు యీవెనింగ్ సిక్స్‌కు బిగినవుతాయి. రేపు యీవెనింగ్ లోపల యెప్పుడైనా సంభవించవచ్చు. పరమపదానికి అన్ని అరేంజ్‌మెంట్లూ జరిగినాయి. కొత్త ఆడిటోరియాన్ని రికార్డు టయంలో కట్టేశారు. యింకా వేలాది మంది భక్తులు రావాల్సి వుంది. సంతర్పణలు అంతూ పొంతూ లేకుండా జరుగుతున్నాయి"

"అయినా, పెద్ద పండగేదో జరగబోతున్నట్టు యీ వేడుకలెందుకు?" అంది ఆమె జీరబోతున్న కంఠంతో. "యెంత గంభీరమైన పేరు పెట్టినా జరగబోయేది చావే గదా?"

"ఆత్మకు డెత్ లేదు. అది కేవలం బాడీలను యెక్స్చేంజ్ చేసు కుంటుందంతే" అన్నాడతను స్పష్టంగా.

"చిరంజీవి యెక్కడున్నాడు?" అంటూ చివాలున ప్రశ్నించింది నిఖిత.

సంతోష్ ఆహారాన్ని నమలడం సైతం మానేసి, "అలా కంప్లీట్ నేమ్‌తో ఆయన్నెవరూ పిలవరిక్కడ! చిన్నాజీ అని పిలుస్తారు" అన్నాడు.

"యింకా నయం, వాళ్ళమ్మగారు పిలిచినట్టుగా బుజ్జీ అని పిలవడం లేదు" అంది నిఖిత నిస్సారంగా నవ్వుతూ.

"ఫారిన్ మ్యాగ్జయిన్సన్నీ ఆయనకు చినిగ్మా అని పేరు పెట్టాయన్నారు. చిరు ప్లస్ యెనిగ్మా, చినిగ్మా అయివుంటుంది. కానీ, యింట్లో ఆయనకింకో నిక్ నేముందని నాకింతవరకూ తెలియదు..." చెబుతూనే పాకెట్ డైరీని పైకి లాగి అందులో నోట్ చేసుకున్నాడతను. అంతలోనే అనుమానంగా. "చిన్నాజీని వాళ్ళమ్మగారు బుజ్జీ అని పిలుస్తారన్న విషయం మీకెలా తెలిసింది? ఆయనతో అక్వేయటెన్సుందా మీకు?" అని ప్రశ్నించాడు.

ఆమె మాట్లాడలేదు.

"చెప్పడం యిష్టం లేకపోతే ఐ కాంట్ ప్రెజరైజ్ యెవర్నీ యే విషయంలోనూ బలవంతం చెయ్యగూడదని ఆశ్రమం రూలు" అన్నాడతను.

వున్నట్టుండి దూరం నుంచీ గంటారావం వినిపించింది. క్యాంటీనులో కూర్చున్నవాళ్ళు సైతం తినడం ఆపేసి కళ్ళు మూసుకుని, చేతులు జోడించేశారు. అందరి పెదవులూ యేదో ప్రార్థనను వల్లిస్తున్నాయి.

యెంగిలి చేత్తో నమస్కరించలేక అవస్థపడుతున్న సంతోష్‌ను చూడగానే నిఖితకు నవ్వు ముంచుకొచ్చింది.

అయిదు నిమిషాల తరువాత మళ్ళీ గంటారావం వినిపించింది. అందరూ లెంపలేసుకుని తినడం ప్రారంభించారు.

"ప్రధానాశ్రమంలో హారతి యిస్తున్నారు" అన్నాడు సంతోష్.

అతడి మాటల్ని పట్టించుకోకుండా, "చిరంజీవి... అదే చిన్నాజీతో మీకు పరిచయముందా?" అని అడిగింది నిఖిత

"వుంది. కానీ నాతో మాత్రం ఆయనకు పరిచయం లేదు" అంటూ బలవంతంగా నవ్వాపుకున్నాడు సంతోష్. "లేకపోతే అంత పాపులర్ ఫిగర్‌తో

నాలాంటి ఆర్డినరీ జర్నలిస్టుకు పరిచయమెక్కడుంటుంది చెప్పండి? ఆయన మేథమాటికల్ జీనియస్సనీ, హ్యూమన్ కంప్యూటరనీ లోకమంతా పొగుడుతోంది. మేథమాటిక్స్‌లో ఆయన సాల్వ్ చేసిన ప్రాబ్లమ్స్ గురించి సెమినార్లు జరిగాయి. ఆయనలాంటివాడు యింకేదైనా దేశంలో పుట్టుంటే పెద్ద పెద్ద ప్రైజులు వచ్చి వుండేవని అంటున్నారంతా!"

"మనకు తెలియని సబ్జక్టులో, మనకు అర్థం కాని గొప్పతనం గురించి నమ్మడం భావ్యం గాదు" అంది నిఖిత నింపాదిగా.

"వాళ్ళ నాలెడ్జి మనకు తెలియకపోవచ్చు. స్వామీజీ మాటల పవరు మాత్రం బాగా తెలుసు" అన్నాడు సంతోష్ కత్తితో కోసినట్టుగా.

"చిన్నాజీనీ లోకమంతా ప్రాడిజీ అంటోంది. యెయిటీన్ యియర్స్ వరకూ ఆయన బిలో ఆవరేజ్ మీడియోకర్ స్టూడెంటే! వీక్‌గా వుంటాడో పోతాడో తెలియకుండా వుండేదంటారు. పెద్ద స్వామీజీ - అనంతానంద స్వామీజీ - బొందితో సమాధిలోకెళ్ళిన తర్వాత స్వామీజీకి కారొనేషన్, అదే పట్టాభిషేకం జరిగిన కొత్తలో జరిగిన సంగతి అది. చిన్నాజీ వాళ్ళ నేటివ్ ప్లేసు యిక్కడికి టెన్ కిలోమీటర్స్‌లో వుంది. చిన్నాజీ ప్రతి ఫ్రైడే క్రమం తప్పకుండా యిక్కడికి బై వాక్ వచ్చేవాడట! అప్పట్లో ఆశ్రమం యింతగా డెవలప్ కాలేదు. యిదంతా పెద్ద ఫారెస్ట్. యిప్పుడిక్కడ యింత పెద్ద ఆశ్రమమూ, చుట్టూ యింత వూరూ పెరగడానికి రీజనేమిటి? స్వామీజీ మహత్యమే! ఆయన చేసిన మాయల్లో చిన్నాజీ కూడా వొకటి! ఆయన ఆశీర్వాదమే లేకుంటే ఆ వీక్ బాడీడ్ బ్లోక్ - బతుకుతాడో, చస్తాడో తెలియని పేషెంటు - టెన్త్ టేబులైనా చెప్పలేని యిడియాటిక్ బాయ్ - యింత జీనియస్సుగా యెలా తయారవుతాడు? సర్వం స్వామిమయం జగత్!"

"యీ యిరవై ముప్పై అంకెల గుణకారాలనూ, యింకా పెద్ద పెద్ద లెక్కల్నీ సాల్వ్ చేసే శక్తి యింట్యూటివ్‌గా చిన్నప్పటి నుంచీ వుండేదనీ, స్వామీజీ కేవలం మానసిక ధైర్యాన్నిచ్చాడనీ కొందరంటారు" అంది నిఖిత కుతూహలంగా కళ్ళు మిలమిలలాడిస్తూ.

"దాన్ని మీరు యింట్యూషన్ అంటారు. నేనేమో మహత్యమనే అంటాను" అన్నాడు సంతోష్ రుమాలుతో ముఖం తుడుచుకుంటూ.

"యిప్పుడైనా ఆయన లెక్కలకు సమాధానాలు మాత్రమే చెప్పగలుగుతున్నాడు. ఆ సమాధానమెలా తెలుసుకున్నాడో సైంటిఫిక్‌గా చెప్పలేక పోతున్నాడు. చేతగాని దాన్ని శాస్త్రమని యెలాగనడం?" నిఖిత తన వాదనను

పొడిగించింది.

"స్వామీజీ అంతటి మహిమాన్వితుల ఆశీర్వాదం దొరికిన తర్వాత యిక ఆర్డినరీ హ్యూమన్ బీయింగ్స్‌యిన సైంటిస్టుల రికగ్నియిజేషన్‌తో పనేముంది? ఆయనకు జరిగిన ఫెలిసిటేషన్ల ముందు, రాని అవార్డుల గొప్పేముంది? యింత చిన్న వయస్సులో యింత సాధించిన మనిషిని యింకొకర్ని చూపించండి. అంతా స్వామి మయం."

తన వాదనకు ముక్తాయింపులా, ఖాళీ చేసిన పళ్ళాన్నెత్తుకుని వాష్ బేసిన్ దగ్గరికి నడచాడు సంతోష్.

తన పళ్ళాన్ని సైతం కడిగి పెట్టేశాక, సంతోష్ దగ్గరికి వచ్చి నిల్చుని "యెంత మేధావి అయితే మాత్రం యేం లాభం? రేపటితో ఆయన ఆయుస్సు తీరిపోతుందని అంటున్నారు కదా మీరు..." అంది నిశిత సాలోచనగా.

"డౌట్ లేదు. స్వామీజీ వాక్కుకు అప్పీలు లేదు. ఫోరియర్స్ కఠిన దీక్ష తర్వాత గానీ చిన్నాజీ పైన స్వామీజీకి దయ కుదరలేదు. వాళ్ళ మదర్‌ని అప్పుడడిగాయన. పేరూ, పాపులారిటీ తెచ్చుకునే అల్పాయుష్కుడు గావాలా? కాకిలా లాంగ్ లైఫ్‌తో బతికేవాడు గావాలా? యెంత గొప్ప డివోటీ గాకపోతే ఆమె మొదటి ఆల్టర్‌నేటివ్‌ను కోరుకుంటుంది? అటువంటి గొప్ప డివోటీలు బతికున్న పీరియడ్‌లో బతుకుతున్నందుకు మన జన్మ కూడా ధన్యమే!" అన్నాడు సంతోష్ ఫలహార శాల ముందున్న వరండాలో కూర్చుంటూ.

"స్వామీజీది యే వూరు? యెక్కడ పెరిగాడు?" అని అడిగింది నిఖిత తాను కూడా పక్కనే కూర్చుంటూ.

"నదుల ఆరిజన్నీ, గొప్పవాళ్ళ బాక్‌గ్రౌండ్‌నూ యిన్వెస్టిగేట్ చేయకూడ దంటారు" అంటూ నవ్వేశాడు సంతోష్. "ఆయన పుట్టింది యీ స్టేట్‌లో గూడా గాదన్నారు. ట్వల్వ్ యియర్స్ తపస్సు చేశాకగానీ ఆయనకు యిక్కడికొచ్చేం దుకు ఫర్మిషను దొరకలేదట! పెద్ద స్వామీజీ వీరిని చూసిన మరుక్షణమే వీరే తన డిసెండెంటని తెలుసుకున్నారట! ఆశ్రమ పీఠాన్ని చేరిన కొద్ది రోజుల్లోనే దీన్నింతగా డెవలప్ చేసి, ఆయన తన కెపాసిటీని నిరూపించి చూపించారు. ఆయన చేయని మహత్యాలూ, నెరవేర్చని కార్యాలూ లేవు. లూయీ షెపర్డ్ రాసిన 'మిరకల్స్ ఆఫ్ స్వామీజీ' చదవండి మీరు. యిక్కడి బుక్ షాప్‌లో దొరుకుతుంది. స్వామీజీ లెక్చర్స్ వాల్యూం కొత్తగా రిలీజయింది. చదవండి. గొప్ప స్పిరిచ్యువల్ యెన్‌లైట్‌మెంటు పొందుతారు."

"నాలుగేళ్ళకు మునుపొకసారి స్వామీజీ పెద్దఅనారోగ్యానికి గుర్తైనారనీ,

అప్పుడాయనకు చికిత్సజేసిన డాక్టరు అయిపు లేకుండా పోయాడనీ పత్రికల్లో రాశారు...'' అంది నిఖిత.

"ఆ మాటలు యిక్కడ పెద్దగా అనకండి. యెవరైనా వింటే డేంజరు. అదంతా గాసిప్. పత్రికలదంతా సెన్సేషనలిజమ్. ఆ విషయం మనకు వేరేవాళ్ళు చెప్పాలా?'' అంటూ హెచ్చరించాడు సంతోష్.

క్యాంటీన్ ముందున్న రోడ్డుపైన నలుగురు విదేశీయులు చిన్మయముద్రలో నడుస్తున్నారు.

పంచ జుబ్బాల్లో వాళ్ళ తెల్లటి శరీరాలు విచిత్రంగా మెరుస్తున్నాయి. వాళ్ళ రాగిరంగు పిలకలు గాలిలో ఆడుతున్నాయి. వాళ్ళ జుబ్బాల పైన స్వామి చిత్రమున్న బాడ్జీ స్పష్టంగా కనబడుతోంది.

"యింతకీ చిరంజీవి యెక్కడున్నాడిప్పుడు?'' నిఖిత గొంతు నూతిలోంచీ పలికినట్టుగా వింతగా ధ్వనించింది. సంతోష్ కోపంతో చివాలున తల పైకెత్తి చూస్తూ, "మరోసారి ఆయన్నలా పిలవకండి. చిన్నాజీ అవతార పురుషుడు. బృహస్పతి అవతారం. రేపటి లోపున అవతారం చాలించబోతున్నారు. మీరంతా చూస్తూ వుండగానే పుష్పరథమెక్కి స్వర్గారోహణ చేయబోతున్నారు. ష్యూర్'' అన్నాడు.

"స్వామీజీ మొదట్లో యేమన్నాడు? ముప్పై అయిదేళ్ళ లోపున పరమపదం పొందుతాడని చెప్పాడు. అవునా? యిప్పుడు కచ్చితంగా కార్తీక పంచమి రోజున అంటున్నాడు. యిలా మాటెందుకు మార్చాడు?'' అంటూ పెంకెగా ప్రశ్నించింది నిఖిత.

"స్వామీజీ మాటల్ని సరిగ్గా అర్థం చేసుకోలేని వాళ్ళు రకరకాల యింటర్‌ప్రిటేషన్లిస్తారు. అది ఆయన ఫాల్టు గాదు. అది హ్యూమన్ మైండుకుండే లిమిటేషను మాత్రమే. రేపటి లోపుగా ఆయన మహత్యాన్ని చూడబోతున్నారు గదా మీరు గూడా!'' అంటూ జేవురించిన ముఖంతో విసుక్కున్నాడు సంతోష్.

"మీరు చిన్నాజీ గారిని కలవాలా? నేను చూపిస్తాను. నాతో రండి'' అన్న కొత్త కంఠమొకటి వెనక నుంచీ వినిపించింది.

నిఖిత తల తిప్పి చూసింది.

## 2

వేదిక పైన పరచిన తెల్లటి పరుపు పైన, పెద్ద తలగడా కేసి జారిగిలబడి కూర్చున్న నడవయసు సన్యాసి ఆకారం, గదిలో వెలుగుతున్న రకరకాల దీపాల

వెలుతురులో నిగనిగలాడుతోంది.

అతడి వెనక గోడ పైన, నిలువెత్తు స్వామీజీ పటం వేలాడుతోంది. దానికి తగిలించిన పూలమాల పైన, రెండు తుమ్మెదలు గీంకారం చేస్తున్నాయి. పటం ముందున్న దీపస్తంభం లోంచీ వస్తున్న కాంతి, గది పైకప్పులోంచీ వెలుగుతున్న ఫ్లోరసెంటు దీపం ముందు వెలవెలాబోతోంది. కిటికీల్లోంచీ వస్తున్న సూర్యకిరణాల ముందు గదిలోని కాంతి కృత్రిమంగా కనబడుతోంది.

వేదిక ముందు రెండు మెట్లకు దిగువగా, కుర్చీలో మరో నడవయస్సు సన్యాసి కూర్చుని వున్నాడు.

దీపాల కాంతికి దూరంగా కూర్చోవడం చేత అతడి శరీరం చీకటి వెలుతురులతో చేసిన చిత్రమైన శిల్పంలా కనబడుతోంది. అతడి ముందున్న కుర్చీలో కూర్చున్న నిఖిత నిరలంకారమైన ఆ గదినంతా మరోసారి కలయ జూసి, "చాలా సేపటి నుంచీ బయట వేచి చూశాను" అంది పుల్ల విరిచినట్టుగా.

"వొకటి రెండు గంటల సేపు నిరీక్షించేదానికే బాధ పడిపోతే యెట్లమ్మా! సాక్షాత్కారం దొరకాలంటే బతుకంతా నిరీక్షించాల్సి రావచ్చు. అంతా వారి కృప" అంటూ వేదిక పైని వ్యక్తికి చేతులు జోడించాడు కుర్చీలో కూర్చున్న వ్యక్తి.

వేదిక పైన కూర్చున్న సన్యాసి అదోలా చూస్తూ కనురెప్పలల్లార్చుతున్నాడు.

"రేపు సాయంకాలం లోపల యెప్పుడైనా సంభవం జరగవచ్చు. సమయానికి అన్నీ సరిగ్గా అమరించాల. చూసేదానికి యువస్వామీజీ ఆ మాదిరిగా నిర్లిప్తంగా, శాంతంగా అగుపిస్తావుండారుగానీ, ఆయన కంటి చూపుతోనే, చేతి సైగతోనే యీ ఆశ్రమంలో పనులన్నీ జరగతా వుండాయి. ఆయన్నీ సమయంలో కలవాలంటే సులభంగా అయ్యే పనిగాదు" అన్నాడు కుర్చీ పైని సన్యాసి.

"నేనేమీ కలవాలని రాలేదు. నేను..."

"తెలుసులే! కానీ, యువస్వామీజీ మాత్రం నిన్నే చూడాలన్నారు" అంటూ అతను వేదిక పైని సన్యాసికేసి చూపెట్టాడు "యీ ఆశ్రమంలో ఆయన ఆజ్ఞ లేకుండా చీమ గూడా కుట్టదు."

"చిన్నాజీ నీకెప్పటి నుంచీ తెలుసు?" యీ సారి ప్రశ్న యువ స్వామీజీ నోటి నుంచీ వెలువడింది.

నిఖిత ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసుకుని చూస్తూ, "పెద్ద పరిచయమేమీ లేదు. కొద్దిగా..." అంటూ మాటలు నాన్చింది.

"నిజం చెప్పాల. యువ స్వామీజికి దివ్య దృష్టుంది. తప్పు చేస్తే చిటికెలో దొరికిపోతావు" అన్నాడు సన్యాసి.

"నిజమే చెప్పాను. యేడాది క్రితం బెంగుళూరులో జరిగిన కాన్ఫరెన్స్‌కు ఆయన గెస్టుగా వచ్చాడు. న్యూస్ కవరేజీ కోసం నేనూ వెళ్ళాను. ఆ నాలుగు రోజులూ ఆయనతో కలిసి తిరిగే అవసరం వచ్చింది. అంతే" అంది నిఖిత.

"అంత చిన్న పరిచయంతోనే ఆయన్ని పేరు పెట్టి పిలిచే చనువెట్ల వచ్చిందో?" అన్నాడు యువస్వామీజీ.

"బెంగుళూరు సెమినారులో కొందరాయనను యింకా చనువుగా పిలిచేవాళ్ళు. మీ ఆశ్రమంలో మాత్రమే ఆయన్నిలా చిన్నాజీ అని పిలుస్తున్నారు" అంది నిఖిత విసుగ్గా.

"యువస్వామీజీతో ఆ మాదిరి దుందుడుకుగా మాట్లాడగూడదు" అన్నాడు శిష్యుడు. "ఆయన దయ అందరికీ దొరికేది కాదు. ముందు జన్మలో పెద్ద పుణ్యం జేసుకోనుంటావు. అందుకే యింత సులభంగా అది దొరికింది. రెండేండ్లకు ముందు నీ మాదిరిగానే జీన్సు పాంటూ షర్టులతో ఫారిన్ జర్నలిస్టు యిక్కడికొచ్చింది. యువ స్వామీజీ దర్శనమిచ్చినారు. ఆమె భక్తురాలైపోయింది. యిప్పుడిక్కణ్ణే బ్రహ్మచారిణిగా బతకతా వుంది..."

"అయితే, చిన్నాజీ రేపు పరమపదం జేరడం తప్పదా?" అంటూ నిస్సహాయంగా ప్రశ్నించింది నిఖిత.

"స్వామీజీ మాటకు తిరుగు లేదు, రాదు, రానివ్వను." లావుపాటి పెదవుల్ని విశాలం చేసి నవ్వుతూ అన్నాడు యువస్వామీజీ. నిఖిత నివ్వెరపోయింది.

"స్వామీజీకీ, యువ స్వామీజీకీ తేడా లేదు" అంటూ అందుకున్నాడు శిష్యుడు. "శరీరాలు వేరే వేరే అయినా వాళ్ళ ఆత్మ వొక్కటే! నరనారాయణుల తీరు. యువ స్వామీజీ ఆధ్వర్యమే లేకపోతే యింత ఆశ్రమమే లేదు. స్వామీజీ అంతరంగిక ఆశ్రమ నిర్వహణను వొక భుజంపైనా, మిగిలిన ఆశ్రమ పరిపాలనను యింకో భుజం పైనా మోస్తా వుండారీయన. దేహంతోనే సమాధిలోకి పోవాలని స్వామీజీ చానాసార్లు సంకల్పించారు. కానీ, యువ స్వామీజీ వొప్పుకోలేదు..."

యువస్వామీజీ ప్రసన్నంగా నవ్వుతూ "నాలుగు రోజుల పరిచయంతోనే కలవాలని వచ్చావు. చిన్నాజీ నిన్నింకా జ్ఞాపకం పెట్టుకున్నాడను కుంటున్నావా?" అని ప్రశ్నించాడు.

"అంత పెద్ద మాథమాటికల్ జీనియస్. యింత చిన్నవిషయం గుర్తుంచుకోలేకపోతారా?" అంది నిఖిత నిశితంగా చూస్తూ. యువ స్వామీజీ ముఖంలో చిన్న చిడుముడిపాటు చెలరేగింది. శిష్యుడు వెంటనే అందుకున్నాడు. "చిన్నాజీ బుర్రలో వెలిగే దీపం వీరి దయాభిక్షే గదా! యేది గుర్తు పెట్టుకోవాల్నో, యేది వద్దో నిర్ణయించేది యీయనే!"

నిఖితకు బుర్ర మొద్దు బారినట్టు తోచింది.

"యీయన గురించి నీకు తెలిసినట్లు లేదు. యీయనకు యువ స్వామీజీగా పట్టం గట్టినాకే యీ ఆశ్రమం యింతగా పెరిగింది. యిక్కడుండే ప్రతి రాయి వెనకా, చెట్టు వెనకా యీయన సంకల్పమే కనిపిస్తాది. యీయన మాట లేకుంటే స్వామీజీ గూడా దర్శనమియ్యరు... పదిహేడేండ్లకు ముందు, పొయ్యే ప్రాణంతో కొట్టు మిట్టాడతా వుండే చిన్నాజీ కాయాన్ని వాళ్ళమ్మ ఆశ్రమానికి మోసుకొచ్చినప్పుడు, వాళ్ళ మీద స్వామీజీకి దయ కలిగించిందెవురు? అంతెందుకు, ఆ విపత్తులో వాళ్ళమ్మను ఆశ్రమాని కొచ్చేటట్లుగా సంకల్పం కల్పించిందెవురు? చెప్పేది యువ స్వామీజీ వంతు, చేసేది స్వామీజీ వంతు" అన్నాడు శిష్యుడు.

"యీ విచిత్రంలో యెవరి భాగమెంతో తెలసుకోవలసిన అవసరం నాకు లేదు" అంది నిఖిత వీలయినంత సంయమనాన్ని ప్రదర్శిస్తూ. "చిన్నాజీకి చిన్నప్పటి నుంచీ ఆస్మా వుందని తెలుసు మీకు. అది బాగా ముదిరిపోయిందని, దాంతో ఆయన చాలా రోజులు బతకడు లెమ్మనుకున్నారు. దాన్ని మీ వాదానికనుగుణంగా మార్చుకోవాలనుకున్నారు. తీరా మీరు చెప్పిన గడువు దాకా ఆయన బతికేసరికి యిప్పుడు మాట మారుస్తున్నారు."

"హిరణ్యకశపుడి అంశంతో పుట్టిన భక్తులంటే యువస్వామీజీకి ప్రీతి యెక్కువ" అన్నాడు శిష్యుడు ముఖం ముడుచుకుంటూ, "చిన్నాజీ ఆయుస్సు తీరిపోతా వుందని తెలిసినా ఆయన కుటుంబంలోని మనుషులంతా యెంత భక్తితత్పరతతో వుండారో నువ్వే చూడు. చిన్నాజీ గూడా ఆయన ఆజ్ఞ ప్రకారం బ్రహ్మచారిగానే వున్నాడింతవరకూ, వాళ్ళవాళ్ళంతా యిప్పుడు పండగ జేసుకుంటా వుండారిక్కడ..."

యువస్వామీజీ అర్ధనిమీలిత నేత్రాలతో ధ్యానం లోకెళ్ళిపోయినట్టుగా వున్నాడు. శిష్యుడు పైకి లేచి దీపపు సెమ్మెలోకి నూనె పోసి, వత్తులెగదోసి తిరిగొచ్చాడు. "చిన్నాజీకి ఆస్మా వుందని నీకెట్ల తెలుసు?" అన్న ప్రశ్న యువ స్వామీజీ నోటిలోంచీ వూడిపడింది. "మానసికంగా అలజడి చెలరేగినప్పుడు

అది ముంచుకొస్తుంది. ఆయనంత యిబ్బంది పడేలా యేదో జరిగుండాలి... నువ్వేం చేశావు?"

"నేనా?... నేను..." నిఖిత కంగారుపడిపోయింది. పైన ఫ్యాన్లు తిరుగుతున్నా గదిలో వుక్కపోతగా వుంది. వాతావరణమంతా ఘనీభవించి తనను బంధించినట్టుగా తోచడంతో నిఖిత విచలితురాలైపోయింది. ఆమె యిబ్బందిని గమనించినట్టుగా శిష్యుడు అదోలా నవ్వేశాడు.

"యువస్వామీజీ దయ నీపైన పడింది. అల్లరి గొర్రెపిల్ల పైన్నే గొడ్ల కాపరి దృష్టి. నువ్వేదో సొంత కోరికపైన్నే ఆశ్రమానికొచ్చినట్టుగా ఆయనకు తెలిసిపోయింది. స్వామీజీ అవతారపురుషులు. ఆయన ఆశీర్వాదం కావాలంటే యువ స్వామీజీ వారి కరుణే దారి! నీ అన్వేషణను దోవ మళ్లించేదానికే నిన్నిట్ల రప్పించినారు. మంత్రోపదేశం చేస్తారు నీకు..."

యువ స్వామీజీకేసి వోసారి తదేకంగా చూసింది ఆమె. అంతలోనే నిలువెల్లా భయంతో వణికిపోయింది. "నేను వెళ్తాను" అంటూ పైకి లేచింది.

"ఆశ్రమానికొచ్చినాక స్వామీజీ నామస్మరణం చెయ్యాల. భక్తితో పవిత్రంగా వుండాల. అనవసరమైన పనులతో కాలహరణం చెయ్యగూడదు. యిక్కడుండే ప్రతి మనిషిపైనా యువ స్వామీజీ నిఘా వుంటుంది" అంటూ హెచ్చరించాడు శిష్యుడు.

బెంబేలుపడుతూ గుమ్మంకేసి కదిలింది నిఖిత.

"ఫరవాలేదు. శాంతంగా ఆలోచించుకోనీ! పరమపద సేవను చూసే వెళ్ళనీ! పత్రికల్లో చక్కగా రాస్తుందిలే" అన్నాడు యువస్వామీజీ.

"చిన్నాజీ రేపటిలోగా... అయితే" అంటూ అర్థాంతరంగా ఆగిపోయింది నిఖిత.

"తప్పదు. దైవ వాక్కు" అన్నాడు శిష్యుడు.

"బెంగుళూరు సభలప్పుడు గుండులా కనిపించాడు. యింత త్వరగా అంత ప్రమాదమెలా ముంచుకొస్తుంది?" అని విస్మయంగా ప్రశ్నించింది ఆమె.

"చిన్నప్పటి నుంచీ ఆయనకు ఆస్మా వుందన్నావు యిప్పుడే! ఆరోగ్యమూ, అనారోగ్యమూ-అన్నీ మాయ! అంతా స్వామీజీ సంకల్పం. సంభవం అవసరమైనప్పుడు పెరటి గుమ్మంలోంచీ గూడా రావచ్చు" అన్నాడు యువ స్వామీజీ.

"స్వామీజీ మాటే సత్యం. యువస్వామీజీ ఆయన మాటల్ని ఆచరణలో పెట్టే దీక్షలోనే వుండారు ముప్పయ్యేండ్లుగా. అవసరమైతే యమధర్మరాజు

చెవులు పట్టి భూమికి లాక్కొచ్చే శక్తి ఆయనకుండాది" అన్నాడు శిష్యుడు పైకి లేచి నిల్చుంటూ.

"అంటే!" భయంతో నిలువెల్లా వణికిపోతూ వెనుదిరిగి చూసింది నిఖిత.

యువస్వామీజీ ముఖంలో అదే చిరునవ్వు యెండిన మల్లె పువ్వులా రెపరెపలాడుతోంది.

శిష్యుడు మాత్రం పూనకం పట్టినవాడిలా పైకి లేచి, దీర్ఘంగా వుచ్ఛ్వాస నిశ్వాసాలు విడుస్తున్నాడు. "నువ్వు యిక్కడి నించీ పొయ్యేలోపల గొప్ప దివ్యానుభవాన్ని పొందతావు. అప్పుడు స్వామీజీ మంత్రోపదేశాన్ని ఆశిస్తావు. నూటికో, కోటికో వొక్కరికి దొరికే వరం అది..." అతడి కంఠం తారస్థాయిలో వెలువడసాగింది. నిఖిత పరుగే నడకగా గది బయటికొచ్చేసింది. కనిపించిన రోడ్డు వెంట పరుగే నడకగా సాగింది. దూరంగా ప్రధానాశ్రమం చుట్టూ వ్యాపించిన భవన సముదాయం కనిపిస్తోంది.

పది నిమిషాలు నడచిన తరువాత, రోడ్డు పక్కన పెద్ద మందిరమొకటి ప్రత్యక్షమైంది. దాని చుట్టూ భక్తజన సందోహమూ కనిపించింది.

తోటి మానవుల్ని చూడగానే కొంత ధైర్యం చేకూరినట్టయింది ఆమెకు.

అలసటతో రొప్పుతూ దారి పక్కన కనిపించిన సిమెంట్ బెంచీ పైన కూలబడింది.

"చిన్నాజీనీ కలవాలని వచ్చారా మీరు?" అన్న కీచుకంఠమొకటి వినిపించింది. నిఖిత పెద్దగా వులిక్కిపడుతూ పక్కకు తిరిగి చూసింది.

## 3

పెద్ద పెద్ద బండరాళ్ళతో నిండిన గుట్ట పక్కన, విశాలమైన మైదానంలో అక్కడక్కడా పాదులు చేసి పెంచుతున్న మొక్కలు కనిపిస్తున్నాయి. కొండ సానువుల్లో రాళ్ళతో వేదికను కట్టి, దానిపైన మూడు పెద్ద నిట్రాళ్ళు నిలబెట్టి, ఆ పైన బోదతో కప్పి చిన్న ఆశ్రయాన్ని తయారు చేశారు. గోడలు లేని ఆశ్రయం నేలపైన, జంబుతీగలతో తయారు చేసిన చాపలు పరిచారు. ఆశ్రయానికంతా కేంద్రంలా వో సన్యాసి పద్మాసనమేసుకుని కూర్చుని వున్నాడు. తెలుపూ నలుపులు సమపాళ్ళలో కలగలసినట్టున్న అతడి జటాజూటం అతడి వయసును తెలియజేస్తోంది. వంగిన వెన్నెముకతో గూడులా వొరిగిన అతడి శరీరం చిన్న తెమ్మెరకే వూగిసలాడే వెదురు కొమ్మలా యెగసెగసి పడుతోంది. వొంటికి చుట్టుకున్న కాషాయ రంగు వస్త్రాలు యీదురు గాలికి అల్లల్లాడుతున్నాయి. ఆశ్రయానికి బయట, మైదానంలో పాతిక మందికి

తక్కువగాని సాధువులు కళ్ళు మూసుకుని ధ్యానంలో మునిగిపోయి వున్నారు.

రెండు రోజుల క్రితం కురిసి వెళ్ళిన వర్ష ప్రభావంతో యింకా కీచురాళ్ళు సవ్వడి చేస్తున్నాయి.

"చెప్పండిస్వామీ. చిరంజీవెక్కడ?" ఆశ్రయంలోని సాధువుకెదురుగా మటమేసుకుని కూర్చున్న నిఖిత అసహనంగా ప్రశ్నించింది.

"యువస్వామీజీ నుడువలేదా మీతో?" అంటూ అతగాడు ప్రశ్ననే సంధించాడు.

"యువస్వామీజీ చెప్పనే చెప్పాడు చిన్నాజీ ప్రధానాశ్రమంలో వున్నాడని. యీ కొత్త మనిషి మాటలు నమ్మి యిలా రావడమే నా పొరబాటు..." ఆమె చెప్పుకుపోసాగింది.

"యింకా యువ స్వామీజీ యేమని పలకారు?" అంటూ అతను అడ్డు తగిలాడు.

నిఖిత విస్మయపడుతూ కాసేపు ఆగి, "రేపు సాయంత్రం లోగా చిన్నాజీ ప్రాణం గుటుక్కుమంటుందని అన్నాడు. స్వామీజీ చెప్పిన మాటను ఆచరణలో పెట్టడమే తన కర్తవ్యమన్నాడు. యముడైనా అడ్డుపడలేడని అన్నాడు" అంది.

"అందుకు యముడే దిగిరావాలా? అంతకు మించిన మహర్షులు యీ లోకంలో వుండరా?" అన్నాడతను, వొక మాట తరువాత వొకదాన్ని స్పష్టంగా వుచ్చరిస్తూ. నిఖిత పెద్దగా వులిక్కిపడింది.

బక్కచిక్కిన అతడి ముఖంపైన, పొడుచుకొచ్చిన యెముకలాగున్న ముక్కు కింద, పొడవాటి బవిరి గడ్డంలోని వెంట్రుకలు అటూ యిటూ కదలడంతో, అతడు నవ్వుతున్నాడేమోననిపిస్తోంది. ప్రమిదల్లాంటి గుంటల మధ్యనుంచీ అతడి కళ్ళు దీపకిరణాల్లాంటి తీక్షణమైన చూపుల్ని రువ్వుతున్నాయి.

"వారింకా యేమని పలికారు? సత్యం పలుకు."

అతడి మాటలధోరణికి ఆమె మరింతగా విభ్రాంతురాలైపోతూ, "నాకు మంత్రోపదేశం చేస్తానన్నాడు. యిక్కడ జరగబోయే సంభవాన్ని గురించి పత్రికల్లో బాగా రాయమని సలహా యిచ్చాడు" అంది.

"సంభవమే జరగకపోయినప్పుడు యేమిని వ్రాయమన్నారు?"

వులిక్కిపడడం అలవాటైపోయినట్టుగా ఆమె శరీరం యెగసిపడింది.

"జరగదంటారా మీరు? నిజమా? చెప్పండి ప్లీజ్" అంటూ ప్రాధేయ పడింది.

"యీ ఆశ్రమఆవరణలో , యీ కుమారస్వామి అనుజ్ఞ లేనపుడు

చీమయినా కుట్టదు. స్వామీజీ నగర పాలనను మా హస్తాలలో వుంచారు" అన్నాడతను.

"యిక్కడ తన మాటే ఆజ్ఞ అనే అన్నాడు యువ స్వామీజీ కూడా" అంది నిఖిత వొదిగుళ్ళు పోతూ.

"ప్రధానాశ్రమంలోనే వారి తాండవం. స్వామీజీ తమ పలుకులే విశ్వసిస్తారని వారి ధీమా! ఆశ్రమం వెలుపల వారికంటే ధీటయిన శక్తి మరొకటి వెలుగుతున్నట్టు వారు గ్రహించడం లేదు."

"ఆయన ధోరణి చూస్తే నాకు భయమేసింది. రేపు సాయంత్రం లోపున చిరంజీవికి సహజమరణం సంభవించకపోతే, ఆ పని ఆయనే యెలాగోలా చేయించేటట్టున్నాడు" అందామె భయంతో వణకుతున్న గొంతుకతో.

"వారందుకు సమర్థులే! స్వామీజీకంత విశ్వాసం వూరికే కలగదు. యువస్వామీజీ సామాన్యులు కారు."

"అయితే చిరంజీవి..." ఆమె గొంతు మరింతగా జీరబోయింది.

"చిన్నాజీకీ, తమకూ సంబంధమేమిటి?" అతడి గొంతుకలో యెటువంటి మార్పూ రాలేదు.

"బెంగుళూరు కాన్ఫరెన్స్‌లో నాలుగు రోజుల పరిచయం. అంతే!"

"అంతమాత్రానికే యింతగా ఆందోళన చెందుతారా యెవరైనా?"

"అంతే! యింకేమీ లేదు..."

"విశ్వాసం కలగడం లేదు."

"పెద్ద మాథమాటికల్ జీనియస్. లోకానికి పనికొచ్చే మనిషి..."

"ఆ మేధను తయారు చేసిందెవరు?"

"మేధను తయారు చేయడం కుదురుతుందా? పదహారేండ్లవరకూ ఆశక్తి అతడిలో నిగూడంగా వుండి వుంటుంది. యెవరో నిద్ర లేపారు. తన శక్తి తనకు తెలిసిన తర్వాత అతను తీవ్రమైన ప్రాక్టీసులో మునిగిపోయాడు. అంచెలంచెలుగా అతడి బుద్ధి పదునెక్కింది. యింకా దానికో శాస్త్రీయ రూపాన్నివ్వలేక అతను తనకలాడిపోతున్నాడు. అదీ నిజం!"

"ఆ శక్తిని నిద్ర లేపిందెవరు? ఆ శక్తి ఆయనలో మాత్రమే నిద్రాణమై వుండడానికి కారకులెవరు? అంతా స్వామీజీ మయం జగత్!"

ఆమె మనసంతా కకావికలైనట్టుగా తోచింది.

కాసేపటి తర్వాత శక్తిని కూడగట్టుకుని, "యువ స్వామీజీ రెకమెండేషను దొరికిన తర్వాతే స్వామీజీ అనుగ్రహం దొరికిందట ఆయనకు" అంది.

"అబద్దం." కుమారస్వామి బలహీన శరీరం కోపంతో వూగిపోసాగింది. "యిందులో వారి ప్రమేయం లేదు. యీ అసత్య ప్రచారాన్ని చేయిస్తున్న వారెవరో మాకు తెలుసు. రేపు ఆ సంభవం జరగకుండా ఆపడమెలాగో మాకు బాగా తెలుసు."

"మీరు ఆపగలరా?" ఆమె ప్రశ్నించింది.

"అనుమానమా? మేమే పూనుకోకపోయి వుండినట్టయితే, చిన్నాజీ యెప్పుడో అవతార సమాప్తి చేసి వుండేవారు."

"........"

"మూడు మాసముల క్రితం చిన్నాజీ గారికి మదరాసులో పెద్ద కారు ప్రమాదం తప్పింది. జ్ఞాపకం వుందా మీకు! తప్పించిన వారు మా అనుచరులే కదా!"

నిఖిత ధ్యాన ముద్రలలో కూర్చున్న వ్యక్తులకేసి చూస్తూ, "వీళ్ళంతా మీ అనుచరులా?" అని అడిగింది.

అతను తల వూపుతూ, "ఆరు మాసముల నుంచీ ఆ ప్రయత్నాలు సాగుతున్నాయి. కానీ, మా అనుచరులు అప్రమత్తంగా చిన్నాజీని కాపాడుతూ వస్తున్నారు. తమ మందిరాలచుట్టూ రక్షణకార్యంలో వున్న సత్సంగీ యులందరూ మా అనుచరులన్న విషయం వారికికూడా తెలుసు. అందుకే బోనులో చిక్కిన సింహాల్లా విలవిలలాడిపోతున్నారు" అన్నాడు.

"చిన్నాజీ మరణం వల్ల లాభం యెవరికి?" ఆమె ప్రశ్నించింది.

"యెవరికో తమకింతవరకూ తెలిసిరాలేదా?"

"గడిచిన ఆరు నెలలుగా చిన్నాజీ అవతారసమాప్తిని గురించిన వార్తలు వింటున్నాం. అంతకు మునుపెందుకీ ప్రయత్నాలు జరగలేదు? యీ ప్రయత్నాలు చేస్తున్నదెవరు? మీరు దాన్నెందుకు ఆపాలని అనుకుంటు న్నారు?"

కుమారస్వామి మెల్లగా నిట్టూర్చాడు. "అంతా మాయ! అన్ని ప్రశ్నలకూ సమా ధానాలు మీ వంటివారికి గోచరించవు. అందుకు ప్రాప్తం వుండాలి" అన్నాడు.

"మీ అనుచరులంతా సాధువులే గదా! వీళ్ళకు ప్రమాదాలు ఆపేటంత శక్తి యెక్కడుంది?" అని ఆమె అడిగింది.

కుమారస్వామి వెనక్కు తిరిగి చేయి వూపాడు. దూరం నుంచీ వో సాధువు పైకి లేచి ఆశ్రమం దగ్గరికి నడచి వచ్చాడు.

"సాధకా! ఆ కొండనధిరోహించి, ఆ పెద్ద బండరాతిని కిందికి దొర్లించు" అంటూ గుట్టకేసి చేయి చాపాడు కుమారస్వామి.

అతను తల వూపుకుంటూ గుట్టపైకెక్కాడు. నిఖిత ఆశ్చర్యపడుతూ చూడ సాగింది.

అయిదు నిమిషాల తర్వాత అతనో పెద్ద గుండును సమీపించాడు. బలమంతా వుపయోగించి దాన్ని నెట్టసాగాడు. యెంతకూ బండ కదలడం లేదు.

"సాధ్యం కాదని తెలిసినా అతడెందుకలా ప్రయత్నిస్తున్నాడు?" అని అడిగింది ఆమె.

"అది అసాధ్యమని అతననుకోవటం లేదు."

"కారణం?"

కుమారస్వామి మరోసారి చేయి వూపాడు.

సాధువు తన ప్రయత్నాన్ని ఆపేసి కిందికి దిగసాగాడు.

"సాధకుడినలాగే కిందికి దుమకమని చెప్పనా?" అంటూ కళ్ళెగరేశాడు కుమారస్వామి.

"అయ్యయ్యో, చస్తాడమో!" నిఖిత కెవ్వున అరచింది.

అతను దగ్గరికి రాగానే, "సాధకా, ఆత్మార్పణకు అనుజ్ఞ రాబోతోంది" అన్నాడు కుమారస్వామి

సాధువు "సిద్ధం స్వామీ" అన్నాడు.

"చస్తావు." కంగారుగా అంది నిఖిత.

"చావు శరీరానికే! ఆత్మకు కాదు."

"మరణం తర్వాత జీవితముందని నమ్ముతున్నావా?"

"లేదని మీరనుకుంటున్నారా?"

"వుందనడానికి సాక్ష్యమేముంది?"

"లేదనడానికి సాక్ష్యమేది? స్వామీజీ సేవలో శరీరాన్ని విడిచిపెడితే స్వర్గద్వారాలు తెరుచుకుంటాయి."

శిష్యుడి సమాధానం వింటూనే కుమారస్వామి "శభాష్" అంటూ మెచ్చుకున్నాడు.

"స్వర్గం అంటే?" నిఖిత సాలోచనగా ప్రశ్నించింది.

"మళ్ళీ పుట్టుక లేకపోవటం..."

"స్వర్గంలో వుండిపోయి యేం చేస్తావు?"

"భగవంతుడి సేవలో తరిస్తాను."

"యింకా?"

"అనంతమైన ఆనందాల్లో మునిగిపోతాను."

"ఆనందం అంటే?"

"కోరుకున్నంత రాసలీల. అందుకోవాలన్నంత మధుపానం."

కుమారస్వామి సాధువుకేసి ప్రసన్నంగా చూస్తూ, వెళ్ళమన్నట్టుగా సైగ చేశాడు.

సాధువు మరబొమ్మలా వెనుదిరిగి వెళ్ళిపోయాడు.

"యిది ఘోరం. యీ మాటలు యే వేదాంత పుస్తకంలోనూ లేవు" అంటూ వాపోయింది నిఖిత.

"వీరికంతా మా మాటే వేదం. ఆత్మార్పణకు సన్నద్ధమైన సాధకులే మా సైన్యం. మరణానికి వెరవనివారికంటే శక్తివంతమైన ఆయుధం యీ భూప్రపంచంలో పుట్టలేదింకా! తుపాకులూ, బాంబులూ వీరి గుండెధైర్యం ముందు బలాదూరు. స్వామీజీతో కలసి యువస్వామీజీ వొక చిన్నాజీని తయారు చేశారు. మేము వొక్కరమే యిందరు సాధకులను రూపొందించాము" అన్నాడతను గంభీరంగా.

"మీ సాధకులకింతశక్తి యెక్కడినుంచీ వచ్చింది?" ఆమె విస్తుపోతూ ప్రశ్నించింది.

"సాధన, భక్తి, గురుబోధ పైన విశ్వాసం. యేకాగ్రత" అన్నాడతను నెమ్మదిగా.

"ఆధ్యాత్మిక దృష్టితో వుండాల్సిన సాధువుల్ని యీ రీతిగా మార్చడం న్యాయమేనా?"

"యిదీ ఆధ్యాత్మికతే!"

"కాదు."

"మరింకేమిటి?"

"అదే అర్థం గావడం లేదు."

"దాన్నే మాయ అంటారు."

"కాదు. అవన్నీ పడకట్టు మాటలు. యీ మాటల యింద్రజాలంలోనే మీ సాధకులూ పడిపోయారు. కానీ, కానీ, నిజం యేమిటి?"

"సత్యాన్వేషణకు మీకో అవకాశం యిస్తాం. యువస్వామీజీ మీతో పలికిన సంగతులన్నీ మాకు విన్నవించుకోండి. శిష్యురాలిగా అనుగ్రహిస్తాం."

"అంతా చెప్పేశాను గదా మీకు."

కాసేపు ఆలోచించిన తరువాత. "మంచిది. స్వామిమయం జగత్. మళ్ళీ మీకు యువస్వామీజీ నుంచీ పిలుపు రావచ్చు. మీకు అందిన సమాచారాన్నంతా మాకు అందజేయండి. గొప్ప ప్రతిఫలం అందుతుంది... ఆధ్యాత్మిక ప్రతిఫలం!"

కుమారస్వామి చేయి మళ్ళీ గాలిలోకి లేచింది.

వయసెంతో తేల్చి చెప్పడానికి వీల్లేని శరీరంతోవున్న సాధువొకడు ఆశ్రయం దగ్గరికొచ్చాడు.

వెళ్ళిరమ్మన్నట్టుగా కుమారస్వామి చేయి వూపాడు. కంచుతో పోతపోసిన విగ్రహంలా కనబడుతున్న సాధువు చకచకా నడచిపోతున్నాడు. గురువాజ్ఞ తప్ప మరొక దానిమీద లగ్నం లేనట్టుగా అతడి పాదాలు ముందుకు కదులుతున్నాయి.

పదిహేను నిమిషాల నడక తర్వాత, ఆశ్రమ ఫలహారశాల దగ్గరికి చేరారు వాళ్ళిద్దరూ. 'యిక మీ యిష్టం వచ్చినట్టు వెళ్ళొచ్చు' అన్న అర్థం స్ఫురించేలా అతనో చిత్రమైన సైగ చేసి, వెనుదిరిగి, వచ్చిన దారిలోనే వెళ్ళిపోయాడు.

వెనక నుంచీ అతడినే గమనిస్తూ విస్మయ చకితురాలైపోయింది నిఖిత.

యింతలో "చిన్నాజీ మిమ్మల్ని పిలుస్తున్నారు" అంటూ వో సాధువు ఆమె ముందుకు వచ్చాడు.

## 4

దర్బారు హాలులా విశాలంగా వున్న మందిరం గోడలకంతా పూలమాలలు వేలాడుతున్నాయి. పైకప్పు నుంచీ రంగురంగుల షాండలీర్లు దీపపుష్పాల్లా వూగుతున్నాయి. గోడలపైన దేవుళ్ళ నిలువెత్తు చిత్రపటాలు సజీవ మూర్తులేమోనన్న భ్రమను కలిగిస్తున్నాయి. హాలు సింహద్వారం దగ్గర రెండు పెద్ద యేనుగు ప్రతిమలు నిలబెట్టబడి వున్నాయి. గోడలకున్న అద్దాల కిటికీ లోంచీ బయట అందంగా పెంచబడుతున్న వుద్యానవనం కనిపిస్తోంది. కిటికీల లోంచీ ఆశ్రమం చుట్టూ కాపలా కాస్తున్న సాధువులు గూడా కనిపిస్తున్నారు.

మందిరానికో చివర్లో, వేదికపైన అమర్చిన బంగారు మలామా నగిషీల సింహాసనం పైన, లావుపాటి సన్యాసి ఆసీనుడై వున్నాడు. ఆయన పెద్దగా శబ్దం చేస్తూ వుచ్ఛ్వాస నిశ్వాసాలు వదిలి పెడుతూ వుండడంతో, ఆయన కట్టుకున్న కాషాయ రంగు పట్టు వస్త్రమూ, కప్పుకున్న కాషాయ రంగు కాశ్మీరు శాలువా యెగసెగసి పడుతున్నాయి. నెరిసిన వెంట్రుకలూ, తెల్లటి పట్టుకుచ్చులాంటి

గడ్డమూ అతడి ముఖంలోని చాలా భాగాన్ని కప్పేశాయి. కనిపిస్తున్న కొద్దిపాటిభాగమూ గోదుమ రంగులో మినమినా మెరుస్తోంది. ఆయన పాదాలు మోపిన చిన్న పీఠికకూ, పాలరాతి నేలకూ మధ్య యెర్రటి తివాచీ డాబుసరిగా వెలుగుతోంది.

వేదిక ముందు నేలపైన కూర్చున్న నిఖిత, స్వామీజీకెదురుగా మందిరానికి మరో చివర్లో వున్న మండపం కేసి తదేక దీక్షతో చూస్తోంది.

మండపంలో దేవతా ప్రతిమల ముందు కూర్చుని, ధ్యాన నిమగ్నుడైనట్టుగా కళ్ళు మూసుకుని వున్నాడో యువకుడు. అతడి తెల్లటి పట్టుఅంగవస్త్రం పైన రోజా పూలమాల కొట్టొచ్చినట్టుగా కనబడుతోంది. అతడికి నాలుగైదు గజాల దూరంలో యిద్దరు నడివయసు స్త్రీలూ, ముగ్గురు మగవాళ్ళూ గుంపుగా కూర్చుని వున్నారు. మరో యిద్దరు పూజారిణులు మండపంలో పూజా సామగ్రిని అమర్చుతున్నారు.

"స్వామీజీకేమైనా... చెప్పుకోవాలంటే చెప్పుకోవచ్చు" అన్నాడు సింహాసనం పైన కూర్చున్న సన్యాసి బొంగురుపోతున్న కంఠంతో.

నిఖిత చుట్టూ వోసారి తల తిప్పి చూశాక బిక్కమొహం పెట్టింది. సన్యాసి మళ్ళీ అదే ప్రశ్నను సంధించాడు. అప్పటికిగానీ ఆయన తనను తాను స్వామీజీ అని పిలుచుకుంటున్న సంగతి ఆమెకు స్ఫురించలేదు.

"చిరంజీ... చిన్నాజీతో మాట్లాడొచ్చా వొకసారి" అంటూ తడారిపోతున్న గొంతుకతో ప్రశ్నించింది నిఖిత.

"ఆయన దీక్షలో వున్నాడు. మూడు రోజులు మౌనవ్రతం. యిహలోకానికి సంబంధించినవేవీ యిప్పుడాయనకు కాబట్టవు. వొక్కపొద్దు" అన్నాడు స్వామీజీ వూపిరి తిప్పుకోవడం కోసం మాటల మధ్య విరామాల్ని పెంచుకుంటూ.

"చిన్నాజీ రేపు సాయంత్రం లోగా..." ఆమె వాక్యాన్ని సగంలోనే ఆపేసింది.

"అంతా స్వామీజీ తలంపు. వేచి చూడు" అన్నాడతను ఆయాసంతో రొప్పుతూ.

"నీ గురించి చెప్పుకో! స్వామీజీ దయ కలుగుతుంది. నీ తల్లితండ్రుల కోరికలు, నీ కోరికలు అన్నీ చెప్పుకోవచ్చు."

"మా అమ్మా నాన్నా హైదరాబాద్‌లో వుంటారు." చీకట్లో దారిని వెతుక్కుంటు న్నట్టుగా తడబడుతూ చెప్పసాగింది ఆమె. "డాడీరిటైరై చాలా రోజులైపోయింది. నేనీ ప్రొఫెషనులో చేరి నాలుగేళ్ళయిపోయింది. జీతం ఫరవాలేదు. కానీ, మరి చిన్నాజీ..."

దూరంగా మండపంలో కూర్చున్న చిరంజీవి కళ్ళు తెరచి చూశాడు. నిఖిత కనబడగానే అతడి ముఖం వివర్ణమైపోయింది. బలవంతంగా మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు.

నిఖిత మెల్లగా నవ్వింది.

స్వామీజీ ముఖంలో సైతం నీడలు కదలాడాయి. "చిన్నాజీ ఆశ్రమంలో విలువైన సంపద... అతనికి కష్టం కలిగే పనేదీ యిక్కడ జరగకూడదు" అన్నాడతను.

"నేలాంటమాటేదీ యెవరితోనూ అనలేదు" అంది నిఖిత గబాలున.

"యికపైన కూడా సత్ప్రవర్తనతో వుండాలి" అన్నాడతను వెంటనే. నిఖిత మళ్ళీ వొకసారి చిరంజీవి కేసి చూస్తూ నవ్వును పొడిగించింది.

"అంతా లీల... కృష్ణ భగవానుడి లీలలు ఆధ్యాత్మికంగా అర్థం చేసుకోవాలి" అన్నాడు స్వామీజీ మరింత పెద్దగా రొప్పుతూ.

"లోకంలో సైంధవులూ, వుత్తరకుమారులూ లీలలు చూపిస్తున్నారు స్వామీ" అంటూ యేదో చెప్పబోయి, అంతలోనే సర్దుకుంది నిఖిత. "అంత విలువైన మనిషని తెలిసీ ఆయన ఆయుస్సును తగ్గించారా మీరు?" అంది అమోమయంగా.

"అంతా పూర్వ జన్మ సుకృతం."

"మనిషంత ఆరోగ్యంగా కనిపిస్తున్నాడు. రేపటిలోగా అదెలా సాధ్యం?"

స్వామీజీ కిటికీలోంచీ బయటికి చూశాడు. సాధువులు గస్తీ తిరుగుతున్నారు.

విసుగ్గా దూరంగా కూర్చున్న వ్యక్తులకేసి చేయి వూపాడు.

దగ్గరికి పరుగు పరుగునా వచ్చిన వ్యక్తి చెవిలో యేదో గొణిగాడు.

"యువస్వామీజీ మీ మాట తప్పదని అన్నారు నాతో! కానీ, కుమారస్వామి మాత్రం అందుకొప్పుకోలేదు. యిద్దరూ మీ శిష్యులే గదా! యిందులో యేది నిజం?" ఆమె మళ్ళీ ప్రశ్నించింది.

స్వామీజీ ముఖం కుంచించుకుపోసాగింది. ఆయన శరీరం పైన విచిత్రంగా చెమట బిందువులు పొటమరించాయి.

యింతలో మందిరానికి అమర్చిన యేసీ మిషను తన సవ్వడిని పెంచుకోవడం నిఖితకు స్పష్టంగా బోధపడింది.

"నీ గురించి స్వామీజీకి చెప్పుకో. తనది మాలిన ధర్మం మొదలు చెడ్డ బేరం" అన్నాడతను గొంతులో వణుకు పెరగుతుండగా!

"బెంగుళూరు కాన్ఫరెన్సులో చిన్నాజీకి గొప్ప సన్మానం జరిగింది." నిఖిత ముఖం చిట్లించుకుంటూ చెప్పసాగింది. "అప్పుడు నేనాయన్ను యింటర్వ్యూ చేశాను. హోటలు గదిలో జరిగిందా యింటర్వ్యూ."

"నీకిచ్చిన సమయం అయిదు నిమిషాలు మాత్రమే!" స్వామీజీ అసహనంగా ఆమె మాటలకడ్డు తగిలాడు. "కుమారస్వామి యింకా యేం చెప్పాడు నీతో!"

"పెద్దగా యేమీ చెప్పలేదు" అంది నిఖిత తన మాటల్ని తానే సరితూచు కుంటున్నట్టుగా. "తన అనుచరులనంతా చూపెట్టాడు. తలా వొక చిన్నాజీలా కనిపించారు వాళ్ళు నాకు. నమ్మకం వల్ల మామూలు మనిషికి గూడా యెంత బలం వస్తుందో చూడ్డానికే ఆశ్చర్యంగా వుంది నాకు. యిదేదో వింత.అద్భుతం. వింత."

"నమ్మకం కుదరాలంటే దైవ కృప వుండాలి" గానుగ మరలోంచీ వెలుపలకొచ్చే చెరకు పిప్పిలా నిస్సారంగా వెలువడింది స్వామీజీ గొంతు.

"మీ శిష్యులిద్దరూ తలో రకం నమ్మకంలో వున్నారు. యిద్దరిలో గెలిచేదెవరు?" అంది ఆమె తల వూపుతూ.

స్వామీజీ పెద్దగా వూపిరి పీలుస్తూ ఆసనంలోనే ఆపసోపాలు పడసాగాడు.

నిఖిత చిరంజీవి వైపుకోసారి చూశాక, "జాతరలో బలికి సిద్ధం చేసిన గొర్రెలా వున్నాడు" అంటూ మెల్లగా గొణుక్కొంది. "యేమిటి? పెద్దగా చెప్పు" అని కంపిస్తున్న కంఠంతో అడుగుతూ, అలాగే ఆసనం పైన సోలిపోయాడు స్వామీజీ. ఆయన తల వో వైపునకు వొరిగిపోయింది. పాదాలు పీఠిక పైన్నుంచీ తప్పుకుని గాలిలో వేలాడుతున్నాయి.

నిఖిత వులిక్కిపడి పైకి లేచి స్వామీజీ దగ్గరికి పరుగెత్తింది. అతని చేతిని తన చేతిలోకి తీసుకుని, కంగారుగా అతని ముఖంలోకి తొంగి చూసింది. మూసుకుపోతున్న కళ్ళను అతి కష్టం పైన తెరవడానికి ప్రయత్నిస్తూ, వోసారి నిఖతకేసి అదోలా చూశాడు స్వామీజీ. ముఖమనే యినుప తెరను తొలగించుకుని యేదో కొత్త ఆకారం వో క్షణం సేపు అతడి లోంచీ బయటికి తొంగిచూసినట్టనిపించింది నిఖితకు.

బెంగుళూరు హోటల్లో, విచలితుడై, నిస్సహాయుడిలా కుప్పకూలిన చిరంజీవి రూపం మళ్ళీ వో సారి ఆమె మనసులో మెదిలింది.

యింతలో స్వామీజీ కళ్ళు పూర్తిగా మూతబడ్డాయి.

దూరంగా మండపం దగ్గర కూచున్న వ్యక్తుల్లో కలకలం చెలరేగింది.

హాలుకవతలి పక్కనున్న గదిలోంచీ, యిద్దరు సాధువులు పరుగు పరుగునా స్వామీజీ దగ్గరికొచ్చారు.

"అపచారం. అపచారం. స్వామీజీని తాకరాదు" అంటూ నిఖితను మంద లించాడొకడు.

"స్వామీజీ దివ్య మాయలోకి వెళ్ళారు. అలా కాసేపు విహరించి వస్తారు. నువ్వు బయటికెళ్ళు వెంటనే" అంటూ అరిచాడు రెండవ వ్యక్తి.

స్వామీజీ చేతిని అలాగే ఆయన శరీరం పైన వుంచేశాక, వెనుదిరిగి మందిరం మధ్య దాకా నడచి వచ్చింది నిఖిత. అక్కడే కాసేపాగి మందిరానికి రెండు చివర్లలో కనిపిస్తున్న వ్యక్తులిద్దరినీ మార్చి మార్చి చూసింది.

స్వామీజీ శరీరాన్ని అలాగే పైకెత్తుకుని లోపలి గదిలోకి మోసుకెళ్తున్నారు సాధువులిద్దరూ.

దీక్ష నుంచీ పైకి లేచే శక్తి లేకపోవడంతో దీనంగా బిక్కుబిక్కుమని చూపులు సారిస్తున్నాడు చిరంజీవి.

5

కార్తీక మాసపు చంద్రుడి నీలిరంగు కాంతిలో 'మృత్యుంజయాశ్రమం' పరిసరాలతో సహా గడ్డకట్టుకుపోయి, స్థాణువులా మారిపోయినట్టు కనిపిస్తోంది. చెట్లు సైతం ఆకులల్లార్చడం లేదు. ఆశ్రమ పరిసరాల్లో వెలుగుతున్న వీధి లైట్ల దగ్గర దీపం పురుగుల సందడి గూడా కానరావడం లేదు. ప్రధానాశ్రమం చుట్టూ, దాదాపు నూరు గజాల కవతల గుంపుగా కూర్చున్న వేలాది మంది భక్తులూ శిలాప్రతిమల్లా కూర్చుండిపోయారు. వుద్యానవనంలో నిల్చున్న సాధువులు సైతం ఆశ్రమ రక్షణ వ్యవహారాన్ని పట్టించుకోకుండా యెక్కడి వాళ్ళక్కడ కూలబడిపోయి వున్నారు. ప్రధానాశ్రమం తలుపులు మూసివేశారు. అద్దాల కిటికీలకు అడ్డంగా తెరలు దిగిపోయాయి. లోపలేం జరుగుతోందో బయటికి కనిపించడం లేదు. భక్తజనం కళ్ళార్పడం గూడా మరిచిపోయి ప్రధానాశ్రమం కేసి చూస్తున్నారు.

జనసమూహానికి దూరంగా సిమెంటు బెంచీ పైన కూర్చున్న నిఖిత, "యేం జరుగుతోందక్కడ? నిన్న సాయంకాలం నుంచీ జనం బయట పడిగాపులు పడుతున్నారెందుకు? యెంతకూ లోపలి నుంచీ సమాచారమేదీ అందడం లేదెందుకు?" అంటూ ఆందోళనగా ప్రశ్నించింది. ఆమె పక్కన కూర్చున్న సంతోష్, "రేపు సాయంకాలమని అనుకున్న సంభవం తెల్లారే లోపలే

జరిగేటట్టుంది" అన్నాడు వుత్కంఠతో వూగిపోతూ.

"అక్కడేదో గూడుపుఠాణీ జరుగుతోంది." నిఖిత గొంతుక జీరబోసాగింది. "సంభవమో, మహత్యమో అందరి ముందూ జరగాలి గానీ, యిలా రహస్యంగా జరగడమేంన్యాయం! యేదో మోసం జరుగుతోంది. లోపలేదో అఘాయిత్యం జరిగిపోతోంది. చివరకు మసిపూసి మారేడు కాయను చేస్తారేమో! చిరంజీవిది సహజ మరణమని నమ్మించేస్తారేమో! యీ జనాలెందుకలా కట్టు కదలకుండా కూర్చున్నారు? తలుపులు పగలగొట్టుకుని ఆశ్రమం లోపలి కెందుకెళ్ళడం లేదు?"

"స్వామీజీ పర్మిషను లేకుండా యెవరూ ముందుకెళ్ళరు" అన్నాడు సంతోష్ వుద్వేగంగా.

"మూర్ఖత్వం." పెద్దగా అరిచింది నిఖిత.

"పెద్దగా మాట్లాడద్దు. డివోటీస్ విన్నారంటే డేంజరు" అంటూ విసుక్కున్నాడు సంతోష్. "ముందే భక్తితో వూగిపోతున్నారు అంతా!"

"భక్తిగాదు. భయం." వీలయినంత మెల్లగా మాట్లాడడానికి ప్రయత్నించింది ఆమె.

వున్నట్టుండి ఆశ్రమం ద్వారాలు తెరచుకున్నాయి.

యువస్వామీజీ భారంగా అడుగులు వేస్తూ వెలుపలికొచ్చాడు.

సాధువులు కొందరు ఆయన దగ్గరికి వెళ్ళారు.

అయిదారు నిమిషాల సేపు వాళ్ళతో మంతనాలాడిన తర్వాత యువ స్వామీజీ తిరిగి లోపలికెళ్ళిపోయాడు.

మళ్ళీ ప్రధానాశ్రమ ద్వారాలు మూసుకు పోయాయి. సాధువులు భక్తుల దగ్గరికొచ్చి మెల్లగా యేదో చెబుతున్నారు. జనంలో అలజడి మొదలయింది. సాధువులు బిగ్గరగా యేదో అరుస్తున్నారు. జనంలోంచీ భజన ప్రారంభమైంది. రానురానూ అది పెద్దగా వినబడసాగింది. హృదయాల్లోంచీ తన్నుకొచ్చినట్టుగా వాళ్ళభజన వుద్వేగంతో సాగిపోసాగింది.

"సంభవం జరిగిపోయినట్టుంది. యెంక్వయిరీ చేసి వస్తాను" అంటూ పైకి లేచాడు సంతోష్.

"అయ్యయ్యో! నిండు ప్రాణం బలైపోయినట్టేనా?" నిఖిత ఆక్రోశించింది.

సంతోష్ ఆమె వైపుకు వురిమి చూస్తూ జనం దగ్గరికెళ్ళాడు. నిఖిత పైకి లేచి కాలుగాలిన పిల్లిలా అక్కడే తచ్చాడసాగింది.

రాయీ రాయీ కొట్టుకునే ఆ అపరాత్రి వేళలో, భక్తుల భజన, కార్చిచ్చులో

గొల్లుమనే అడవి జంతువుల గోలలా విచిత్రంగా ధ్వనించింది.

అయిదు నిమిషాల తరువాత సంతోష్ తిరిగొచ్చాడు. అతని చెంపల పైన కన్నీళ్ళు స్రవిస్తున్నాయి. "స్వామీజీ యీజ్ దా గ్రేటెస్ట్! తన బాడీని వదిలిపెట్టి యేదో ముఖ్యమైన పనికోసం వెళ్ళారు" అన్నాడు. నిఖిత అయోమయంగా చూసింది.

"యెవరైనా డివోటీలు కాపాడమని ప్రేయర్ చేసినప్పుడు స్వామీజీ యిలా ఫిజికల్ బాడీని విడిచిపెట్టి వెళ్ళిపోతారు. ఆయన తిరిగొచ్చేవరకూ భజన జరగాల్సిందే" అన్నాడతను.

"చిరంజీవి సంగతేమిటి?" అంది నిఖిత విసుగ్గా.

సంతోష్ ఆమె మాటల్ని గమనించకుండా భజనతో గొంతు కలపసాగాడు.

"మీ స్వామీజీకి హై బీపీ. శిష్యులిద్దరూ యిరుకున పెట్టడంతో టెన్షనులో పడి కొట్టుకుంటున్నాడు. బహుశా డాక్టరు దగ్గర ట్రీట్‌మెంట్ చేయించుకుంటూ వుంటాడిప్పుడు" అంది ఆమె.

"మీ హ్యూమన్ బ్రెయిన్లకుండే కెపాసిటీ అంతే! దానికి అందని సీక్రెట్లెన్నో వున్నాయి లోకంలో" అన్నాడు సంతోష్ వెక్కిళ్ళు మధ్య.

భక్తుల భజన పాటలో పడి కొట్టుకుపోతున్న వోటి పడవలా వుంది ఆశ్రమం.

నడిరాతిరి ఆకాశం, కిందికి దిగి ఆశ్రమం చుట్టూ ప్రహరీ గోడను నిర్మించి నట్టుంది.

"యిక్కడింత అన్యాయం జరుగుతుంటే పోలీసులేమయ్యారు? ప్రభుత్వమే మయింది?" అంటూ ఆక్రోశించింది నిఖిత.

"అక్కడుండే భజన బృందంలో యెందురు ఆఫీసర్లూ, లీడర్లూ వున్నారో తెలుసా మీకు! గొప్పగొప్పవాళ్ళే సొల్యూషను వెతుక్కుంటూ ఆశ్రమం చేరుకుంటారు" అన్నాడు సంతోష్ గొంతులో యేడుపు తన్నుకొస్తుండగా. అతడి వెక్కిళ్ళను నివ్వెరపోయి వినసాగింది నిఖిత.

చాలాసేపటి తర్వాత మళ్ళీ ప్రధానాశ్రమం తలుపులు తెరుచుకున్నాయి.

జనం మరింత పెద్దగా గొంతు చించుకోసాగారు.

సాధువులు పెద్ద బంగారు రంగు సింహాసనాన్ని మోసుకొచ్చి వరండాలో వేశారు. రకరకాల పాత్రలతో పళ్ళూ, పూలహారాలూ మోసుకొచ్చారు. అయిదారు మంది సాధువులు సింహాసనం ముందు కూర్చుని హోమం రగిలించారు. కాసేపటి తర్వాత బిగ్గరగా మంత్రనాధం వెలువడసాగింది.

"సంభవం జరిగిపోయినట్టుంది" అంటూ రోదిస్తున్నాడు సంతోష్.

చక్రాలున్న సింహాసనాన్ని నెట్టుకుంటూ సాధువులు కొందరు బయటికొచ్చారు.

సింహాసనం పైన పూలమాలల దొంతరల మధ్యలో స్వామీజీ ఆకారం స్పష్టాస్పష్టంగా కనబడసాగింది.

భక్తులందరూ "సర్వం స్వామీజీమయం" అంటూ కేరింతలు కొట్టసాగారు.

"అనుకున్నంతా అయింది" అంటూ నిఖిత చతికిలబడింది. ఆమె గుండె వేగంగా కొట్టుకో సాగింది. పెదవులు అదరసాగాయి.

యిలోగా బక్కపలచటి కుమారస్వామి ఆకారం ప్రధానాశ్రమం లోంచీ బయటికొచ్చింది. నేరుగా అతను బంగారు సింహాసనం పైకెక్కి కూర్చున్నాడు.

భజన హోరెత్తిపోసాగింది. జనాలు కొందరు పారవశ్యాన్ని తట్టుకోలేక స్పృహ కోల్పోతున్నారు. యెక్కడి జనాలు అక్కడ, కర్పూరం వెలిగించి, మూర్ఛపోయిన వాళ్ళకు హారతులు పడుతున్నారు.

ప్రధానాశ్రమంలోంచీ పెద్దగా గంటారావం వినవచ్చింది. దీపాలు వెలుగుతున్న పెద్ద హారతి పళ్ళెంతో పాటూ యువస్వామీజీ బయటికొచ్చాడు.

అతడి వెనువెంటే చిరంజీవి గూడా నడుస్తున్నాడు.

నేల పైనుంచీ యెవరో విసిరి కొట్టినట్టుగా పైకెగిరి, "చిరంజీవి బతికే వున్నాడు" అంటూ అరిచింది నిఖిత.

యువస్వామీజీ కుమారస్వామికి హారతి పడుతున్నాడు. అతడి పాదాలకు గంధం రాస్తున్నాడు.

సంతోష్ జనం దగ్గరికి పరిగెత్తాడు.

సంభ్రమాశ్చర్యాలతో నిఖిత పయ్యెద యెగసిపడుతోంది. అసంకల్పితంగా కళ్ళలోంచీ జారుతున్న అశ్రువుల్ని తుడుచుకోవడం సైతం మరిచిపోయి ఆమె అటే చూడసాగింది.

యెదురు గాలికి యిష్టం వచ్చినట్టుగా విసురుకెళ్ళే వాన తుంపరల్లా, భక్తుల గానం తత్తళించిపోతోంది. ఆకాశంలో మెల్లమెల్లగా చీకటి రంగు పలచబారుతోంది. చంద్రవంక పాలిపోవడం ప్రారంభమైంది.

చాలాసేపటి తర్వాత సంతోష్ సిమెంట్ బెంచీ దగ్గరికి తిరిగొచ్చాడు. "స్వామీజీ కరుణాసముద్రుడు, భక్తవత్సలుడు, ప్రేమమూర్తి, డివైన్ యిన్‌కార్నేషన్. ఆయన ప్రేమ అనన్య సామన్యం. చిరంజీవి కోసం తన ఆయుస్సునే దానం చేసిన అమృతమూర్తి" అన్నాడు గుక్కిళ్ళు మింగుతూ.

"స్వామీజీ చనిపోయాడా?" వులిక్కిపడుతూ అడిగింది నిఖిత.

"కాదు. ఫిజికల్ బాడీని వదలిపెట్టి సమాధిలో కెళ్ళిపోయారు. ఆయుస్సును చిన్నాజీకీ, ఆశ్రమాన్ని కుమారస్వామీజీకి అప్పగించి వెళ్ళారు. ఆయన భౌతిక కాయం సాక్షిగా యువస్వామీజీ కుమారస్వామీజీకి పట్టాభిషేకం చేస్తున్నారిప్పుడు" అన్నాడతను యేడుపుతో రాసుకుపోయిన గొంతుకతో.

నిఖిత నివ్వెరపోయింది.

సింహాసనం పైన కూర్చున్న కుమారస్వామిజీ పాదపీఠకపైన పుష్పాలన మరుస్తున్నాడు యువ స్వామీజీ. చిన్నాజీ వింజామర వీస్తున్నాడు.

"స్వాములిద్దరికీ యేదో అగ్రిమెంటు కుదిరినట్టుంది" అనుకుంటూ నిట్టూర్చింది నిఖిత.

కాసేపటి తర్వాత, "చిన్నప్పుడు చదివిన ముని పుంగవుడి కథ జ్ఞాపకం వస్తోంది" అంది మెల్లగా.

సంతోష్ తల తిప్పకుండా భజన చేసుకుంటున్నాడు. అతడికి మరింత చేరువగా వెళ్ళి "తన నామస్మరణ చేస్తూ నదిని దాటమని శిష్యులను ఆజ్ఞాపించిన గురువుగారి కథ" అంటూ చెప్పసాగింది. "సంగతి తెలిసిన గురువుగారికి అనుమానం వచ్చింది. తీరా వో రోజు రహస్యంగా వాళ్ళను గమనించాడు. నామస్మరణ చేస్తూ వాళ్ళు నిజంగానే నదినీళ్ళ పైన నడుస్తున్నారు. తన నామానికంత మహత్యముందని ఆయనకంతవరకూ తెలియలేదు. వాళ్ళు వెళ్ళిపోయిన తర్వాత, తాను గూడా తన నామస్మరణ చేస్తూ నదిపైన నడవబోయాడు. మునిగిపోయాడు..." చెబుతూ చెబుతూ నిఖిత నవ్వేసింది. కాసేపటి తర్వాత "యింతకూ యిక్కడ గురువెవరు? శిష్యులెవరు? మునిగిందెవరు?" అని ప్రశ్నించింది.

"కొందరు కళ్ళుండీ చూడలేరు. చెవులుండీ వినలేరు. అంతా వాళ్ళ కర్మ" అంటూ విసుక్కున్నాడు సంతోష్ తన భజనను కాసేపు ఆపి.

"మానవ శరీరానికి నమ్మకం చెప్పలేనంత బలాన్నివ్వవచ్చు! అయితే, శరీరానికి నమ్మకం కంటే ముఖ్యమైన అవసరాలు కొన్ని వుంటాయి. వాటిని దానికందజేయకపోవడం దుర్మార్గం, శాడిజం, మాసోచిజం."

సంతోష్ ముఖం అవతలికి తిప్పుకున్నాడు.

"అయితే యిక మీ చిన్నాజీకి ప్రమాదం తప్పినట్టేనా" అని అడుగుతూ నిఖిత పైకి లేచి తన జిప్‌బ్యాగును భుజానికి తగిలించుకుంది.

సంతోష్ కళ్ళుగట్టిగా మూసుకుని భజనలో ధ్యాసను నిమగ్నం చేయడానికి

ప్రయత్నించసాగాడు.

అప్పుడప్పుడూ వెనుదిరిగి చూస్తూ, ప్రధానాశ్రమం దగ్గరి నుంచీ, ఆశ్రమం గేటు దాకా నడచి వచ్చింది నిఖిత.

ప్రహరీ గోడకవతల వరసగా నిలచిన మోటరు వాహనాల దగ్గర జనసంచార మింకా మొదలవలేదు.

"యీ డ్రైవర్లు గూడా లోపలే వున్నట్టున్నారు" అని గొణుక్కుంటూ నిఖిత వో ఖాళీ మెటాడర్‌లోకెక్కి కూర్చుంది.

ఆశ్రమం లోంచీ భజనలూ, మంగళవాద్యాలూ, శంఖారావాలూ మిన్నుముట్టు తున్నాయి.

లోపల జరుగుతున్న సంరంభంలో ముఖ్య పాత్రధారులైన యిద్దరు వ్యక్తుల ఆంతరంగిక రహస్యాలు రెండు, తన దగ్గర దాగున్నాయన్న విషయం హఠాత్తుగా ఆమెకు జ్ఞాపకం వచ్చింది.

నిఖిత తెరలు తెరలుగా నవ్వసాగింది. అంతవరకూ ఆమె కనుకొలుకుల్లో నిలిచి వుండిపోయిన రెండు కన్నీటి బొట్లు ఆమె బుగ్గలపైకి పాకాయి.

*(యిండియాటుడే వార్షిక సంచిక, 2002)*

❖ ❖ ❖